క్షణికావేశం రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది..
నవమాసాలు మోసి పెంచిన పేగుబంధాన్ని తెంచేసింది..
అమ్మ ప్రేమ ముందు మృత్యువైనా ఓడిపోతుందంటారు..
కానీ ఆమె జాలిలేని శిలగా మారుతుందని ఎవరూ అనుకోలేదు..
అమ్మ చేతితో ఏదిచ్చినా అది అమృతమే అనుకున్నారు తప్ప
అదే తమ పాలిట కాలకూట విషమని ఆ పసిమొగ్గలు ఊహించలేదు..
జీవితంలో ముళ్లబాటలు ఉంటాయి.. కష్టనష్టాలు ఉంటాయని తెలిసిన అమ్మకు
అవన్నీ శాశ్వతం కాదని ఎందుకు గ్రహించలేకపోయిందో..
ముక్కుపచ్చలారని బిడ్డలను మనస్పర్థలకు బలి ఇచ్చింది..



కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఊపిరి తీసిన పేగుబంధం..!

- బిడ్డలకు విషమిచ్చి ఆత్మహత్యాయత్నం
- ఇద్దరు కుమారులు మృతి
- తల్లి పరిస్థితి విషమం

..ఈ హృదయ విదారక ఘటన సంతబొమ్మాళి మండలంలో చోటుచేసుకుంది.. కుముందవానిపేటను కన్నీటి సంద్రంలో ముంచేసింది.. - న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

సంతబొమ్మాళి మండలం మలాగం పంచాయతీ కుముందవానిపేట గ్రామంలో మంగళవారం పెను విషాదం చోటు చేసుకుంది. ఓ తల్లి సోమవారం రాత్రి ఇద్దరు కుమారులకు శీతల పానీయాల్లో ఎలుకల మందు కలిపి తాగించి, తానూ ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందగా, తల్లి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. కుముందవానిపేటకు చెందిన రాజుతో అదే గ్రామానికి చెందిన దుర్గకు 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి రుషి(9), బాలాజీ(8) ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిద్దరూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నారు. తండ్రి రాజు శ్రీకాకుళం నగరంలో ఓ హోటల్‌లో పనిచేస్తున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం గ్రామంలో దసరా వారాలు కావడంతో తన ఇంటికి భోజనాలకు రావాలని దుర్గను సోదరుడు హరి పిలిచారు.

ఉదయమే వస్తానని చెప్పిన అక్క రాకపోవడంతో హరి అనుమానంతో ఇంటికి వెళ్లారు. ఉదయం 9 గంటలు దాటినా తలుపులు వేసి ఉండటంతో తెరిచేందుకు ప్రయత్నించినా రాకపోవడంతో స్థానికుల సాయంతో బలవంతంగా తెరిచారు. ఇంట్లో ఇద్దరు చిన్నారులు విగతజీవులుగా పడి ఉండగా దుర్గ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. వెంటనే ఆమెను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. భర్త దూరంగా ఉండటంతో జీవితం మీద విరక్తి చెంది అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులకు దుర్గ తెలిపింది.



మృతి చెందిన రుషి, బాలాజీ

గ్రామంలో విషాద ఛాయలు

ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడిన విషయం తెలుసుకుని పెద్ద సంఖ్యలో స్థానికులు ఇంటి వద్దకు చేరుకున్నారు. విగతజీవులుగా పడి ఉండటాన్ని చూసి బంధువులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తండ్రి రాజు గుండెలు బాదుకుని ఏడ్చారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టెక్కలి సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

మంత్రి ఆరా..

ఈ ఘటనపై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరా తీశారు. ఇద్దరు చిన్నారులు మృతి చెందడం బాధాకరమన్నారు. ఘటనకు గల కారణాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా కొండపల్లి శ్రీనివాస్



గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా కొండపల్లి శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం జిల్లాకు చెందిన ఈయన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, పరిశ్రమలు, ఎన్నారై సాధికారత శాఖల బాధ్యతలు చూస్తున్నారు. ఈయన ఇక నుంచి జిల్లాలోని ప్రభుత్వశాఖల పని తీరు, సంక్షేమ పథకాల అమలను పర్యవేక్షిస్తారు. జిల్లాకు చెందిన మంత్రి కె.అచ్చెన్నాయుడికి రెండు జిల్లాల బాధ్యతలు అప్పగించారు. పార్వతీపురం మన్యం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ఇన్‌ఛార్జిగా అచ్చెన్న వ్యవహరించనున్నారు.

భవిష్యత్తు నీదే బాలికా..!

చదువు ఆపేసిన విద్యార్థినుల గుర్తింపునకు సర్వే

న్యూస్‌టుడే, బలగ (శ్రీకాకుళం)

కిశోర వికాసానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేయనుంది. గతంలో తెదేపా హయాంలో కిశోర బాలికలను గుర్తించి వారి స్థితిగతులపై క్రమం తప్పకుండా సర్వే చేసేవారు. పోషకాహార, రుతు రుమాళ్ల కిట్ అందించేవారు. వైకాపా పాలనలో ఐరన్ మాత్రలతో సరిపెట్టేశారు. కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు బాలికలను గుర్తించి చదువు మానేసిన బాలికలు వివరాలు ఐసీడీఎస్ అధికారులు తెలుసుకుంటున్నారు. ఈ నెలాఖరుకు ప్రక్రియను పూర్తి చేయనున్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

జిల్లాలో చాలా మంది బాలికలు ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆపేస్తున్నారు. బాల్యవివాహాలకు సైతం అడ్డుకట్ట పడట్లేదు. మరికొంత మంది కళాశాలలు అందుబాటులో లేకపోవడం, ఇంటి బాధ్యతలు వంటి కారణాలతో విద్యకు దూరమవుతున్నారు. ఈ సమస్యను అధిగమనించేందుకు చంద్రబాబు ప్రభుత్వం నడుం బిగించింది. 14 నుంచి 18 ఏళ్ల లోపు వారిని గుర్తించి, చదువు మానేసిన బాలికలను ఆయా కేంద్రాల పరిధిలో బృందాలుగా ఏర్పాటు చేసి చదువు చెప్పడంతోపాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది.

జిల్లాలో వివరాలిలా..	ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 16	14 నుంచి 18 ఏళ్లలోపు బాలికలు: 1,26,000

ఉన్నత విద్య, ఉపాధిపై మార్గనిర్దేశం

పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో శిక్షణకు పీజీటీల సాయం తీసుకునేలా చర్యలు తీసుకున్నారు. 14 -18 ఏళ్ల వయసున్న విద్యార్థినులకు నాలుగు రోజుల పాటు ఆయా పాఠశాలలు, కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తారు. మానసిక వికాసం, యుక్త వయసులో శరీరంలో వచ్చే మార్పులు, సామాజిక అంశాలు, పిల్లలపై లైంగిక దాడులు, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు, ఆత్మరక్షణ, ఇతర అంశాలను ప్రధానంగా బోధించి బాలికల్లో నూతనోత్సాహం నింపుతారు.

120 మందికి శిక్షణ..

జిల్లాలోని 16 ప్రాజెక్టుల పరిధిలో సీడీపీవోలు, ఏసీడీపీవోలు, 120 మంది పర్యవేక్షకులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. ప్రస్తుతం ఎంత మంది బాలికలు ఉన్నారో సర్వే చేస్తున్నాం. విద్యాశాఖ, ఐసీడీఎస్ సంయుక్తంగా కార్యక్రమాన్ని చేపట్టనున్నాం.

- శాంతిశ్రీ, ఐసీడీఎస్ పీడీ, శ్రీకాకుళం

భక్తజన సిరి..

వైభవంగా విజయనగరం పైడితల్లి సిరిమానోత్సవం

అశేష జనవాహిని.. వేలాది ఘటాలు.. మేళతాళాలు.. వేదపండితుల మంత్రోచ్చరణలు.. పులి వేషాలు.. విచిత్ర వేషధారణల నడుమ సిరుల తల్లి.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి విజయనగరం పైడితల్లి సిరిమాను సంబరం మంగళవారం కనుల పండువగా సాగింది. ఆద్యంతం అంబరాన్నంటేలా ఉత్సవం జరిగింది. తల్లి ప్రతిరూపంగా ఉన్న సిరిమానును పూజారిని భక్తులు మనసారా మొక్కి.. పునీతులయ్యారు.

– న్యూస్‌టుడే, విజయనగరం బృందం



ఘటాలతో తరలివస్తున్న మహిళలు



భక్తుల సేవలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు





పైడిమాంబ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన సిరిమానోత్సవంలో భాగంగా వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు. ఉదయం నుంచి భక్తులు దర్శనానికి బారులుదీరారు. తొలుత హుకుంపేటలోని సిరిమానును దర్శించి.. అనంతరం చదురుగుడికి చేరారు. లక్షలాది మందితో క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. మధ్యాహ్నం పూజారి బంటుపల్లి వెంకటరావు తల్లి ప్రతిరూపంగా సిరిమానును అధిరోహించారు. ప్రత్యేక ఆకర్షణగా బెస్త వారి వల, పాలధార, ఏనుగు రథం, అంజలి రథాలు నిలిచాయి.





అమ్మ దర్శనానికి బారులుదీరిన భక్తజనం



కోటపై నుంచి వీక్షిస్తున్న అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు

పట్టు వస్త్రాల సమర్పణ: రాష్ట్ర పండగ కావడంతో ప్రభుత్వం తరఫున జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సతీసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు పూసపాటి వంశీయులు, దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన సతీమణి సునీలా గజపతిరాజు, కుమార్తె, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ దంపతులు, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్, ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు ఇతర ప్రజాప్రతినిధులు ఉత్సవాలను తిలకించారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి కొండపల్లి దంపతులు, ఎంపీ కలిశెట్టి



సిరిమానుకు నమస్కరిస్తున్న బొత్స దంపతులు

ఇచ్ఛాపురంలో అన్న క్యాంటీన్

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో మరో అన్న క్యాంటీన్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటివరకు శ్రీకాకుళం, పలాస, ఆమదాలవలస పట్టణాల్లో వీటిని ప్రారంభించారు. తాజాగా మంగళవారం ఇచ్ఛాపురం పట్టణంలో గాంధీ పార్కు వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ రిబ్బన్ కత్తిరించి పేదల ఆకలి తీర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. 'పేద, మధ్య తరగతి ప్రజలు, కార్మికుల ఆకలి పట్టని వైకాపా ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసివేసింది. విధ్వంసకర పాలన సాగించిన గత పాలకులకు ప్రజలు బుద్ధి చెప్పారు. పేదలకు రూ.5కే భోజనం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా క్యాంటీన్లు ఏర్పాటు చేశారు' అని అశోక్ అన్నారు. పురాధ్యక్షురాలు పిలక రాజలక్ష్మి, కూటమి నాయకులు బుద్ధాల నిర్మలారెడ్డి, దాసరి రాజు, సాలిన డిల్లీ, ఆశి లీలారాణి, కాళ్ల ధర్మారావు, నందిక జాని, కాళ్ల దిలీప్, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అశోక్, నాయకులు



రూ.8.37 లక్షలు ఖర్చు చేసి సుందరంగా తీర్చిదిద్దిన గార మండలం కొర్లాం పంచాయతీ కర్ణాల చెరువు



ప్రస్తుతం అధ్వానంగా ఇలా..

లక్ష్యాన్ని చెరువుల్లో కలిపేశారు..!

- అమృత్ సరోవర్ పథకానికి తూట్లు
- రూ.కోట్లు వెచ్చించినా కానరాని అభివృద్ధి

చెరువులో నీటి సంరక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన అమృత్ సరోవర్ పథకం నీరుగారిపోయింది.. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో వీటి అభివృద్ధికి ఆర్భాటం చేసిన అధికారులు నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. ఫలితంగా అభివృద్ధి చేసిన చెరువులన్నీ అధ్వానంగా దర్శనమిస్తున్నాయి.. పనికిరాని మొక్కలు, చెత్తతో నిండిపోయాయి. కొన్నిచోట్ల చేసినట్లు చూపినా అసలు చేశారా అన్నట్లుగా కనిపిస్తున్నాయి. నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి.

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం,
– న్యూస్‌టుడే ఎచ్చెర్ల, మెళియాపుట్టి, పొలాకి, గార



ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో పోలమ్మ చెరువు ఇది. రూ.5.21 లక్షలు ఖర్చు చేశారు. నిర్వహణ లేక గట్టుపై పనికిరాని మొక్కలతో ఇలా దర్శనమిస్తోంది.

ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 2022లో కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలో కనీసం 75 చెరువులను అమృత్ సరోవర్ పథకంలో అభివృద్ధి చేయాలని తలపెట్టింది. ఎకరా విస్తీర్ణం ఉన్నవాటిని గుర్తించి, ఉపాధి నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో మొదటి, రెండో విడతలో మొత్తం 86 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందుకుగాను ఒక్కోదానికి రూ.5-10 లక్షల చొప్పున మొత్తం రూ.6.27 కోట్లు ఖర్చు చేశారు. వీటితో ఆయా చెరువుల్లో వెయ్యి క్యూబిక్ మీటర్ల పూడిక తీయడం, నాలుగువైపులా గట్టును పటిష్ఠం చేయడంతో పాటు గట్లపై మొక్కలు నాటాలి. ఆహ్లాదకరంగా ఉండేలా సేదతీరేందుకు బెంచీలు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

నిర్వహణకు నీళ్లొదిలారు..

పథకంలో భాగంగా అన్ని చోట్ల పనులు పూర్తి చేశామని అధికారులు చెప్పుకొస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. చాలా వరకు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. పోలాకి మండలంలో ఓ చెరువు గర్భంలో మట్టి తీసి గట్టుమీద వేసి వదిలేశారు. ఇలా చాలా ప్రాంతాల్లో పనులను అసంపూర్తిగానే వదిలేశారు. కొన్నిచోట్ల ఖర్చు చేసిన ఆనవాళ్లే లేవు. అత్యధికంగా ఎచ్చెర్ల మండలంలో 6 చెరువులకు రూ.47.3 లక్షలు, ఇచ్ఛాపురం మండలంలో ఐదింటికి 36.96 లక్షలు ఖర్చు చేశారు. అత్యల్పంగా జలుమూరు మండలంలో ఒకదానికి 5.92 లక్షలు వ్యయం చేశారు. కానీ వీటి నిర్వహణకు అధికారులు చేతులెత్తేశారు.

స్థానిక సంస్థలదే బాధ్యత

అమృత్ సరోవర్ పథకం కింద ఉపాధి నిధులతో చేపట్టిన పనులకు నిర్వహణ బాధ్యత ఆయా గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులకే ఉంటుంది. డ్వామా ఆధ్వర్యంలో పనులు మాత్రమే చేపడతాం. మొక్కలను మూడేళ్ల వరకు పరిరక్షించే బాధ్యత మాదే.

– సుధాకర్, పీడీ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, శ్రీకాకుళం

ఎక్కడ మొక్కల సంరక్షణ..?

గత ఐదేళ్లు వైకాపా సర్కారు తీరుతో పంచాయతీల్లో నిధులు దారిమళ్లించడంతో వీధి దీపానికే ఖర్చు పెట్టలేని దుస్థితి. ఇక లక్షల్లో నగదు అవసరమయ్యే చెరువుల నిర్వహణను ఎవరు పట్టించుకుంటారు. చెరువులన్నీ అపరిశుభ్రత నడుమ పనికిరాని మొక్కలు ఏపుగా పెరిగి అధ్వానంగా తయారయ్యాయి. కొన్నిచోట్ల దారి సైతం మూసుకుపోయింది. గట్లపై నాటిన మొక్కలకు సంబంధించి చిన్న తరహా మొక్కలకు రెండేళ్లు, పెద్ద తరహా మొక్కలను మూడేళ్ల పాటు పరిరక్షించాల్సిన బాధ్యత ఉపాధి అధికారులదే. కానీ తలపెట్టిన వాటిలో చాలావరకు చెరువు గట్లపై మొక్కలే కనిపించలేదు. ఇక వాటి పరిరక్షణ దేవుడెరుగు.

పీజీ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఏపీ పీజీసెట్-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ అనంతరం ఎచ్చెర్లలోని డా. బి.ఆర్.అంబేడ్కర్‌విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ పీలా సుజాత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీ సెట్-2024కు హాజరై అర్హత సాధించిన విద్యార్థులు మాత్రమే తక్షణ ప్రవేశాలకు అర్హులన్నారు. వీరికి బోధనా రుసుము, ఉపకార వేతనాలు వర్తించవని, కోర్సుల వారీగా నిర్దేశించిన రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రవేశాలకు హాజరయ్యే విద్యార్థులు రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని సూచించారు. ఆ తర్వాత ప్రకటించిన తేదీల్లో అవసరమైన ధ్రువపత్రాలతో సైన్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రధానాచార్యుల కార్యాలయాలను సంప్రదించాలని స్పష్టం చేశారు.

పోలీసుల సమయస్ఫూర్తితో నిలిచిన ప్రాణం


ఎస్పీ మహేశ్వరరెడ్డి నుంచి నగదు పురస్కారం అందుకుంటున్న హెడ్ కానిస్టేబుల్ అమ్మాజీ

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న పోలీసులు సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో ఓ నిండు ప్రాణం నిలిచింది. వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని పోలీసులు రక్షించిన ఘటన శ్రీకాకుళం నగరంలో చోటు చేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ అమ్మాజీ మంగళవారం రాత్రి పొన్నాడ వంతెన వద్ద బీట్ విధుల్లో ఉన్నారు. 1.30 గంటల సమయంలో నగరంలోని మావూరివీధి చెందిన జి. శివప్రసాద్ అనే వ్యక్తి వంతెనపై నుంచి నాగావళి నదిలోకి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. గమనించిన ఆమె ఏఆర్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, మహిళ హోంగార్డు నారాయణమ్మతో కలిసి నీటిలో మునిగిపోతున్న శివప్రసాద్‌ను ఒడ్డుకు తీసుకువచ్చారు. అనంతరం ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలుసుకుని ఆయనకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు. ఈ సందర్భంగా ముగ్గురినీ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ వివేకానంద, సీఐ, పైడపునాయుడు, ఎస్సై హరికృష్ణ ఉన్నారు.

ఈకేవైసీ సవరణకు నేటితో ఆఖరు

– న్యూస్‌టుడే, నరసన్నపేట


మడపాం రైతు సేవా కేంద్రంలో ప్రదర్శిస్తున్న జాబితాలు

ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు సాగు చేసే పంటల వివరాల నమోదు ప్రక్రియ ముగిసింది. ఈ పంట నమోదుతో పాటు ఈకేవైసీ గడువు పూర్తవడంతో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నమూనా జాబితాలను ప్రదర్శిస్తున్నారు. ఈ నెల 16 వరకు జాబితాల పరిశీలనకు అవకాశం ఇచ్చారు. అనంతరం తుది జాబితాలను విడుదల చేయనున్నారు.

ఖరీఫ్‌లో వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు వీలుగా నిర్దేశించిన ఈ పంట నమోదుకు గతనెల 30తో గడువు ముగియగా, ఈకేవైసీ వివరాల సేకరణకు ఈనెల 10తో అవకాశం ముగిసింది. పంటల నమోదుతో ముడిపడి ధాన్యం కొనుగోలు, రుణాలు, విపత్తుల సమయంలో ఆర్థిక సాయం వంటివి ప్రభుత్వం అందించనుంది. జిల్లాలో 4,75,934 ఎకరాల్లో వివిధ పంటలకు సంబంధించి 3,56,227 మంది రైతులు వివరాలు నమోదు చేసుకున్నారు. ఇందులో 4,45,718 ఎకరాలకు 2,17,881 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేశారు. నమోదు గడువు పూర్తయిన నేపథ్యంలో తప్పొప్పులు సరిదిద్దేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. పంటల నమోదు నమూనా జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నారు. ఇందులో తప్పులుంటే సరిదిద్దేందుకు అవకాశం కల్పించారు.

జాబితాలు సిద్ధం చేస్తున్నాం

ఈ పంట నమోదు చేసుకున్నవారి జాబితాలు సిద్ధం చేస్తున్నాం. జాబితాల్లో తప్పులు ఉంటే సవరించుకునే వెసులుబాటు ఉంది. రైతులు అవకాశం వినియోగించుకోవాలి.

– కె.త్రినాథస్వామి, జేడీ, వ్యవసాయశాఖ

చెరువులో మునిగి యువకుడి మృత్యువాత


నవీన్(పాత చిత్రం)

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: దుర్గాదేవి నిమజ్జనోత్సవంలో చోటు చేసుకున్న అపశ్రుతి ఓ కుటుంబంలో అంతులేని ఆవేదన మిగిల్చింది. విగ్రహాన్ని చెరువులో దించుతుండగా రణస్థలం మండలం అక్కయ్యపాలెం గ్రామానికి చెందిన దాన నవీన్(21) ఈత రాక మునిగిపోయాడు. జేఆర్‌పురం ఎస్సై ఎస్. చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అక్కయ్యపాలెంలో విగ్రహ ఊరేగింపు అనంతరం ఎర్ర చెరువులో రాత్రి 11 గంటల సమయంలో కొంత మంది యువకులు విగ్రహానికి దించుతుండగా వారి చేతుల్లో నుంచి జారిపోయింది. ఆ సమయంలో నవీన్ విగ్రహం కింద ఉండి మునిగిపోయాడు. చీకటిలో ఎవరూ గమనించకపోవడంతో అంతా ఇళ్లకు వెళ్లిపోయారు. నవీన్ రాకపోవడంతో కుటుంబ సభ్యులు యువకులు ఇళ్లకు వెళ్లి ఆరా తీశారు. అనంతరం అంతా కలిసి గాలించినా ఆచూకీ లభించకపోవడంతో తెల్లవారుజామున 3 గంటల సమయంలో చెరువులోని విగ్రహం నిమజ్జనం చేసి ప్రదేశంలో చూడగా నవీన్ మృతదేహం లభించింది. ఒక్కగానొక్క కొడుకుని విగతజీవిగా చూసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించి, తండ్రి లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నదిలో స్నానానికి వెళ్లి విద్యార్థి...


రంజిత్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: వంశధార నదిలో స్నానానికి వెళ్లి విద్యార్థి మృత్యువాత పడిన ఘటన శ్రీకాకుళం గ్రామీణ మండలం పొన్నాం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైరి చిట్టిబాబు పెద్ద కుమారుడు రంజిత్‌కుమార్(17) విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది చదువుతున్నాడు. ఇటీవల దసరా సెలవులకు ఊరు వచ్చిన రంజిత్ బంధువులు, స్నేహితులతో కలిసి సోమవారం ఉదయం వంశధార నదికి వెళ్లాడు. స్నానం చేస్తుండగా ఊబిలో దిగి గల్లంతయ్యాడు. గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది గాలించినా ఎక్కడా అచూకీ దొరకలేదు. మంగళవారం బట్టేరు సమీపంలో గెడ్డ వద్ద మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు గ్రామీణ ఎస్సై కిశోర్ వర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి ప్రమాదంలో దుర్మరణం

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కాశీబుగ్గ సీఐ డి.మోహనరావు తెలిపిన వివరాల మేరకు పలాస సీతారాంనగర్‌కు చెందిన టి.మురళి (36) ఈ నెల 12న ద్విచక్ర వాహనంపై మెళియాపుట్టి మండలం గొప్పిలి వెళ్లి తిరిగి వస్తుండగా అల్లుఖోల గ్రామం వద్ద అదుపు తప్పి పడిపోవడంతో గాయాలయ్యాయి. మెరుగైన చికిత్సకు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన భార్య ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

ఈవీ హవా..!

- జిల్లాలో పెరుగుతున్న విద్యుత్తు వాహనాల వినియోగం
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న ఉద్యోగులు, యువత

డబ్బు ఆదా

విద్యుత్తు వాహన వినియోగంతో రవాణా వ్యయం భారీగా తగ్గింది. లీటరు డీజిల్‌కు 16 నుంచి 17 కిలోమీటర్లు మైలేజీ ఇచ్చే కారుతో నెలకు సగటున మూడు వేల కి.మీ తిరిగితే కిలోమీటరుకు ఆరేడు రూపాయలు, పెట్రోల్ వాహనమైతే.. రూ.7 నుంచి రూ.8 వరకూ అవుతుందని తెలిపిన వినియోగదారులు అదే దూరానికి విద్యుత్తు కారు వినియోగిస్తే కి.మీకు రూ. 1.60 మాత్రమే అవుతుందని విద్యుతుశాఖ, నెడ్‌క్యాప్ అధికారులు చెబుతున్నారు. పెట్రోల్, డీజిల్ వ్యయంతో పోలిస్తే విద్యుత్తు వాహనం ఛార్జింగ్ ధర చాలా తక్కువ.

ద్విచక్రవాహనాలు	- 2,087
కార్లు	- 670
ఆటోలు	- 106
గూడ్స్ వాహనాలు	- 05
మోటార్ క్యాబ్స్	- 32


రైతుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన విద్యుత్తు వాహనం

ఎచ్చెర్ల, రణస్థలం, న్యూస్‌టుడే: నిన్న మొన్నటి వరకూ పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన ఈవీ (విద్యుత్తు వాహనాలు) వినియోగం నేడు పట్టణాలతోపాటు పల్లెలకు కూడా పాకింది. జిల్లాలో రెండు మూడేళ్ల నుంచి వీటి కొనుగోళ్లు పెరుగుతుండటంతో షోరూంలు ఏర్పాటవుతున్నాయి. నిర్వహణ ఖర్చు సైతం తగ్గుతుండటంతో ప్రజలు వీటిపై ఆసక్తి చూపుతున్నారు.


కుశాలపురం బైపాస్ కూడలి వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన షోరూం

వినియోగం పెరిగింది

గతంలో ఈవీ వాహనం నగరాల్లో కొద్ది మంది వినియోగించేవాళ్లు. గత మూడేళ్ల నుంచి ఈవీల వినియోగం పెరిగింది. నేను కుశాలపురం బైపాస్ కూడలిలో నెల రోజుల కిందట ఈవీ వాహనాల షోరూం ఏర్పాటు చేశాను. ఈ నెలలో మొత్తం 14 వాహనాలు అమ్ముడు పోయాయి.

– తామర రామారావు, వాహన షోరూం యజమాని

ఏర్పాటుకు రాయితీ..

ఇంజిన్ మోత లేకుండా, విద్యుత్తు చాలిత వాహనాలుగా విపణిలోకి వచ్చిన ఈవీలు క్రమంగా ప్రజాదరణ పొందాయి. ఆటోలు, స్కూటీలు, కార్లు జిల్లాలో ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయి. ఈవీలతో డబ్బు ఆదా అవుతోందని వాహన యజమానులు చెబుతున్నారు. పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలతో పోలిస్తే ఈవీలు కొంచెం ఖరీదైనా.. కొనేందుకు చూపుతున్నారు. అయితే జిల్లాలో ఎక్కడా ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో లేకపోవడం ఒక లోటు. విద్యుతు ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు భారీ ఖర్చు అవుతుందని అందుకే వెనకాడుతున్నట్లు షోరూం యజమానులు చెబుతున్నారు. తాజాగా ప్రభుత్వం రూ.3 లక్షల రాయితీ ప్రకటించనున్న నేపథ్యంలో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే వాహనదారులకు ఉపశమనం కలుగుతుంది.

చాలా ఉపయోగం..

నేను వీఆర్వోగా పని చేస్తున్నాను. నేను ఏడాది క్రితం ఈవీ వాహనాన్ని కొనుగోలు చేశాను. గతంలో వినియోగించే పెట్రోల్ వాహనానికి రూ. 150లు నుంచి రూ. 200 ఖర్చు అవుతుండేది. ప్రస్తుతం రోజంతా సుమారు 80 నుంచి 90 కిలోమీటర్లు ఒక్కోసారి వందకిలోమీటర్లు పైగా తిరుగుతున్నాను. కేవలం రోజుకు రూ. 20లు ఖర్చు అవుతోంది. నాలాంటి ఉద్యోగులకు ఈవీ చాలా ఉపయోగంగా ఉంటుంది.

బహిరంగంగా మద్యం తాగిన వ్యక్తికి జైలు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: బహిరంగంగా మద్యం తాగిన వ్యక్తికి శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి 14 రోజులు జైలు శిక్ష విధించారు. శ్రీకాకుళం ఒకటో పట్టణ పరిధిలో బలగ మురళీకృష్ణ అనే వ్యక్తి సోమవారం రాత్రి బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి.. స్థానికులను ఇబ్బంది పెట్టడంతో ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేశారు. ఆయనను మంగళవారం కోర్టులో హాజరుపరచగా జడ్జి శివరామకృష్ణ జైలు శిక్ష విధించారు. మురళీకృష్ణపై గతంలోనూ మూడు కేసులున్నాయని, రౌడీషీట్ కూడా తెరిచి ఉన్నట్లు ఎస్సై చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

హత్య కేసులో మరో నలుగురి అరెస్టు

నరసన్నపేట, న్యూస్‌టుడే: పోలాకి మండలం వనవిష్ణుపురంలో ఈనెల 8న వైకాపా శ్రేణుల దాడిలో తెదేపా కార్యకర్త పాలిన వీరస్వామి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో మరో నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ జె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇప్పటికే ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం పాలిన మోహనరావు, పాలిన శ్యామ సుందరరావు, ఇప్పిలి కోటేశ్వరరావు, తలగాన లావన్నలను అరెస్టు చేశారు. మొత్తం 12 మందిని నిందితులుగా గుర్తించగా, 11 మందిని ఇంతవరకు అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు. వనవిష్ణుపురంలో ఇంకా పోలీస్ పికెట్ కొనసాగుతోంది.

సామాజిక మాధ్యమాల్లో పవన్‌పై అనుచిత పోస్టులు


సీఐ మోహనరావుకు ఫిర్యాదు చేస్తున్న జనసేన కార్యకర్తలు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రతిష్ఠకు భంగం కలిగేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు జనసేన కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈమేరకు కాశీబుగ్గ సీఐ డి.మోహనరావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై వజ్రపుకొత్తూరు పోలీసు స్టేషన్‌లో జనసేన మండల కార్యకర్తలు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జనసేన పలాస నియోజకవర్గ సమన్వయకర్త వి.దుర్గారావుకు కొందరి నుంచి బెదిరింపు ఫోన్లు వస్తున్నాయని.. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి: కలెక్టర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలో 15 ఏళ్లు నిండిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. వయోజనవిద్యపై కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లాస్ అనే కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘ లబ్ధిదారులు, పాఠశాలల్లో పని చేసే ఆయాలు, నైట్ వాచ్‌మెన్లు, తదితరులపై దృష్టి పెట్టాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా తరగతులు నిర్వహించాలని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ విద్య, సంక్షేమ కార్యదర్శులు నోడల్ అధికారులుగా వ్యవహరించాలన్నారు. మండలాలవారీగా అక్షరాస్యత లక్ష్యాలను నిర్దేశించాలని వివరించారు. జిల్లా, మండలస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలను సాయంత్రం వేళ 2 గంటలు అక్షరాస్యత తరగతులకు అందుబాటులో ఉంచాలని ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీకి సూచించారు. వాలంటీర్ టీచర్స్, లెర్నర్ ఉల్లాస్ యాప్ ద్వారా వారి పేర్లు నమోదు చేయాలన్నారు. సమావేశంలో వయోజనవిద్య డీడీ ఎం.వి.రమణ, సభ్యులు డీపీవో కె భారతీసౌజన్య, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నీటి తీరువా వసూళ్ల లక్ష్యం చేరుకోండి



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, చిత్రంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: త్వరలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నందున నీటి తీరువా వసూళ్ల లక్ష్యం చేరుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో మంగళవారం నిర్వహించిన దూరదృశ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులను వేగవంతం చేయడంతో పాటు పని దినాలు పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను శతశాతం పూర్తి చేయాలన్నారు. గృహనిర్మాణాలకు సంబంధించిన ఇసుక, సిమెంట్, ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో ఎం.అప్పారావు, జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి, డీపీవో భారతీసౌజన్య, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలకు ఎంపిక


ప్రసాద్

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: అండర్-25 విభాగంలో అంతర్రాష్ట్ర టెస్ట్ క్రికెట్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ ఎంపికయ్యాడు. బీసీసీఐ ఆధ్వర్యంలో బెంగళూరులో ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న పోటీలకు సంబంధించిన రాష్ట్ర జట్టును ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ప్రధాన కార్యదర్శి ఎస్.సతీష్ బాబు ఖరారు చేశారు. అందులో జట్టు వికెట్ కీపర్‌గా ప్రసాద్‌కు అవకాశం కల్పించారు. ఈ ఏడాది జరిగిన జిల్లా, జోనల్, అంతర జిల్లాల పోటీల్లోనూ వికెట్ కీపర్, బ్యాటర్‌గా ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రసాద్ తుది జట్టులో స్థానం నిలబెట్టుకున్నాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లెల శాస్త్రి, హాసన్‌రజా, మెంటార్ ఇలియాజ్ అహ్మద్ అభినందించారు.

పాతటెక్కలిలో వైకాపా కార్యకర్తల దాష్టీకం


పలాస ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తెదేపా సానుభూతిపరులు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం పాత టెక్కలిలో వైకాపా కార్యకర్తలు బరి తెగించారు. గ్రామానికి చెందిన తెదేపా సానుభూతిపరులపై మంగళవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. సాధారణ ఎన్నికల్లో తెదేపా తరఫున పని చేశారనే అక్కసుతో ముగడ గంగయ్య, నర్సమ్మ దంపతులు, వారి కుమారుడు గిరిపై అదే గ్రామానికి చెందిన వైకాపా కార్యకర్తలు ముద్దాడ దానయ్య, కొల్లి దామోదరరావు, మోరియా దాడికి పాల్పడ్డారు. ముగ్గురికీ గాయాలయ్యాయి. బాధితులు 108లో పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వజ్రపుకొత్తూరు ఏఎస్సై జిన్నారావు అక్కడికి చేరుకుని ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు.

17న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా


మాట్లాడుతున్న కేఎస్ఎస్ ప్రసాద్, చిత్రంలో యూటీఎఫ్ నాయకులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా డీఈవో కార్యాలయాల వద్ద ధర్నా చేయనున్నట్లు ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య(యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే జీపీఎఫ్ ఖాతాలను ప్రారంభించి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరారు. ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఆర్.మోహనరావు, ఎస్.కిశోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్.బాబురావు, బి.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దశలవారీ పోరాటానికి సిద్ధం కండి


సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: తపాలాశాఖలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించే వరకు దశలవారీ పోరాటానికి ఉద్యోగ సంఘాలన్నీ సిద్ధం కావాలని జాయింట్ కౌన్సిల్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ పిలుపునిచ్చింది. దేశవ్యాప్త పిలుపులో భాగంగా శ్రీకాకుళం నగరంలోని జిల్లా తపాలా సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు గణపతి, బాబూరావు, బెవర అప్పారావు, యు.వి.రమణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం	: 9440437129
పలాస	: 8008574279
కవిటి గ్రామీణం	: 8309638875
పలాస గ్రామీణం	: 7386408926
కంచిలి గ్రామీణం	: 9704568738

సమస్య: ఇచ్ఛాపురం పట్టణ పరిధి వీకే పేటలో మంచినీటి బావికి వెళ్లేందుకు దారి లేకుండా ఆక్రమించేశారు.
– కేవీ ప్రసాదరావు, ఇచ్ఛాపురం

సమాధానం: ప్రజాబావి ప్రాంతంలో రాకపోకలకు అడ్డంకులు సృష్టించిన వారిపై చర్యలు తీసుకుంటాం. – ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం

సమస్య: పలాస మండలం ఈదురాపల్లి ప్రధాన వీధిలో మురుగు కాలువ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. – స్థానికులు

సమాధానం: త్వరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– ఫల్గుణరావు, పంచాయతీ కార్యదర్శి, కేదారిపురం
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, పలాస గ్రామీణం

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

సౌత్ జోన్ ఖోఖో పోటీలకు ఎంపిక


రెయ్యి తనూజ

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణంలోని కాదా లక్ష్మీకాంతమ్మ పురపాలక సంఘ బాలికోన్నత పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న రెయ్యి తనూజ, సాడి తేజశ్రీ, గొరెల భవాని, మరం హారిక, గుండుబోతి చందన సౌత్ జోన్ ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో జరిగే పోటీలకు పయనమయ్యారు. వారిని ప్రధానోపాధ్యాయురాలు ఎం.పద్మవల్లి, వ్యాయామోపాధ్యాయురాలు టి.లత, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర జట్టుకు రెయ్యి తనూజ కెప్టెన్‌గా వ్యవహరించనుందని తెలిపారు. విద్యార్థినులకు వ్యాపారవేత్తలు బత్తుల వెంకటరమణ, రామచంద్రారెడ్డి ఆర్థికంగా సహకారం అందించారు.

పల్లె పండగతో గ్రామాల అభివృద్ధి


ఇచ్ఛాపురం మండలం తులసిగాంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

పలాస గ్రామీణం, సోంపేట, ఇచ్ఛాపురం గ్రామీణం, కవిటి గ్రామీణం, వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో మంగళవారం 'పల్లె పండగ' పేరిట కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పల్లె పండగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వ్యాఖ్యానించారు. పలాస మండలం టెక్కలిపట్నం, బంటుకొత్తూరు పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. సోంపేట మండలం ఇసుకలపాలెం, జింకిభద్ర, బెంకిలి గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇచ్ఛాపురం మండలం కొఠారి, ధర్మపురం, తులసిగాం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. కవిటి మండలం భైరిపురం, రాజపురం, కొజ్జిరియా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడ, కొత్తపేట, ఎస్‌జేపురం, పొల్లాడ, దేవునల్తాడ గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ నిర్వహించారు.

విద్యార్థినులకు అభినందన

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మండల పరిధి బాతుపురం ఉన్నత పాఠశాల విద్యార్థిని తామాడ హరిణి బృందం రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మల్కిపురంలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. వారిని ప్రధానోపాధ్యాయుడు బళ్ల సుభాష్‌బాబు, పీడీ షేక్ మహ్మమద్, ఉపాధ్యాయులు అభినందించారు.


★ కవిటి మండలం కపాసుకుద్దిలో తెదేపా హయాంలో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణం శ్లాబు దశ వరకు వచ్చింది. వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఇక్కడి కేంద్రం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు.


★ ఇచ్ఛాపురం మండలం బూర్జపాడులో అంగన్‌వాడీ-1, 2 కేంద్రాల భవనాల నిర్మాణాలు నిధుల కొరతతో నిలిచిపోయాయి. రెండు కేంద్రాలు అద్దె ఇళ్లలో నిర్వహిస్తున్నారు. ఆరేళ్ల నుంచి ఇదే పరిస్థితి నెలకొనడంతో గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు..!

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే

కనీస వసతులు లేక లబ్ధిదారులకు ఇబ్బందులు

మాతాశిశు సంరక్షణలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, ఆరు నెలల నుంచి ఆరేళ్ల లోపు వయసున్న పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్య నేర్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. కనీస సౌకర్యాలు లేని అద్దె భవనాల్లో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైకాపా ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణాలను విస్మరించింది. ఐదేళ్లలో ఎక్కడా పనులు చేపట్టిన దాఖలాలు లేవు. సొంత భవనాల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఇచ్ఛాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 260 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 138 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. కనీస వసతులు లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. తెదేపా హయాంలో ఇచ్ఛాపురం మండలంలో మొదటి దశ కింద 2016-17లో 25 భవనాలు మంజూరు కాగా 10 పూర్తయ్యాయి. శ్లాబు దశలో 9 ఉన్నాయి. పునాది దశలో 6 నిలిచిపోయాయి.

★ రెండో దశ కింద 2018-19లో 7 భవనాలు మంజూరు కాగా రెండు భవనాల పనులు ప్రారంభించారు. డొంకూరు-1, 3, కేశుపురం, బిర్లంగి-1, 3, భవనాల పనులు ప్రారంభించలేదు.

★ కవిటి మండలంలో మొదటి దశలో 29 భవనాలు మంజూరైతే 20 భవనాలు పూర్తి చేశారు. 8 భవనాలు శ్లాబు దశలో నిలిచిపోయాయి. బి.గొనపపుట్టుగలో పనులు ప్రారంభించలేదు. రెండో దశలో 9 భవనాలు మంజూరు కాగా శ్లాబు దశలో 7, చివరి దశలో ఒకటి, పునాది దశలో 1 నిలిచిపోయాయి. అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కేంద్రాలను నడపాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రభుత్వానికి నివేదించాం..

అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాల పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదించాం. అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు పరిధికి సంబంధించిన వివరాలు అడిగారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు కేంద్రాలను నిర్వహిస్తాం.
– పి.నాగరాణి, సీడీపీవో, ఇచ్ఛాపురం

లారీలతో బెంబేలు



ఇచ్ఛాపురం పట్టణంలోకి రద్దీ వేళల్లో భారీ వాహనాల రాకపోకలను పోలీసులు నిషేధించినా నిత్యం వస్తున్నాయి. ఇరుకు వీధి మలుపుల్లో లారీలు అడ్డంగా ఉండిపోవడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోతోంది. పరిస్థితిని చక్కదిద్దడానికి పోలీసులు లేక సమస్య తీవ్రమవుతోందని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సీఐ ఎం.చిన్నంనాయుడును 'న్యూస్‌టుడే' సంప్రదించగా లారీల రాకపోకలపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వ్యర్థాలతో ఇక్కట్లు

కంచిలి మండలం జాడుపూడి కాలనీ వద్ద జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయింది. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దుర్వాసన వెదజల్లుతుండటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా వ్యర్థాలను తొలగించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం



దారి అధ్వానం..భల్లూకాల భయం



మందస మండలం చీపి నుంచి బొందుకారి వెళ్లే మార్గంలో గెడ్డ వద్ద ఒకవైపు రోడ్డు పాడైంది. రాళ్లు తేలి బురదగా మారింది. అక్కడే మలుపు, లోతుగా ఉండడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రి వేళ బురదలో వాహనం చిక్కుకుంటే ముందుకు వెళ్లడం కష్టమవుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ తరచూ ఎలుగుబంట్లు సంచరిస్తుండటంతో ప్రయాణించడానికి భయపడుతున్నారు. ఈ విషయమై ఐటీడీఏ శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

శునకాల స్వైరవిహారం

వజ్రపుకొత్తూరు మండలం పూండి బస్టాండ్ పరిసరాల్లో శునకాలు స్వైరవిహారం చేస్తూ ప్రయాణికులపై దాడికి దిగుతున్నాయి. ఇటీవల ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిపై, పాదచారులపై గుంపుగా విరుచుకుపడటంతో పలువురు గాయపడ్డారు. వారపు సంతకు వచ్చే వారినీ గ్రామ సింహాల భయం వెంటాడుతోంది. ఈ విషయమై ఎంపీడీవో రమేశ్‌నాయుడును 'న్యూస్‌టుడే' సంప్రదించగా శునకాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం



పడకేసిన తాగునీటి పథకం



మందస మండలం సాబకోట పంచాయతీ బిత్తరబంద లోని తాగునీటి పథకం నుంచి 10 రోజులుగా నీరు సరఫరా కావడం లేదు. కొండ దిగువ భాగంలోని వాగు నీరు తెచ్చి వినియోగిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై సర్పంచి ఎస్.సంధ్యను 'న్యూస్‌టుడే' సంప్రదించగా రెండు రోజుల్లో బాగు చేయిస్తానని తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

కలాం సేవలు ఎనలేనివి


కంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


పలాస మండలం బ్రాహ్మణతర్లాలో..

పలాస గ్రామీణం, ఇచ్ఛాపురం, కంచిలి, ఇచ్ఛాపురం గ్రామీణం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో మంగళవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి కలాం చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆకాంక్షించారు.

ఆచార్య సాయిబాబా మృతి తీరని లోటు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలం బొడ్డపాడులోని అమరవీరుల స్మారక మందిరంలో మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యావేత్త ఆచార్య జీఎన్ సాయిబాబా సంతాప సభ నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం పోరాడారని గుర్తు చేశారు. సాయిబాబా మృతి పీడిత ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తిరి దానేష్, సాలిన వీరాస్వామి, కోత ధర్మారావు, మద్దిల మల్లేశ్వరరావు, కుసుమ, బాలకృష్ణ, గోవింద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ సభ్యుల వితరణ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి గొర్లెపాడు గ్రామానికి చెందిన బుర్జి శ్రీకాంత్ అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలో చికిత్స పొందుతున్నాడు. అతని వైద్య ఖర్చులకు ఎస్‌జీఎస్ సభ్యులు మంగళవారం రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఎస్‌జీఎఫ్ సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బసవకొత్తూరులో హెచ్ఐవీ పరీక్షలు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి బసవకొత్తూరులో మంగళవారం చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ఏపీ శాక్స్ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 88 మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 162 మందికి వైద్యులు అజయ్, ఎస్కే అఫ్రీద్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. హెచ్ఐవీ జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణరావు, సర్పంచి ఎం.ఈశ్వరరావు, రాముడు, ఏఎన్ఎం ఢిల్లమ్మ, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న బెంతొరియాల దీక్షలు

కవిటి, న్యూస్‌టుడే: కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కవిటిలో బెంతొరియాలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం కొన్నాయిపుట్టుగ గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాలు లేక పిల్లల భవిష్యత్తు ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

టీపీసీ ఛైర్మన్‌కు అభినందన



రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబురావును మంగళవారం ఆబ్కారీ శాఖ పలాస సీఐ మల్లికార్జునరావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. నిమ్మాడలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోదరుడు ప్రసాదరావును బాబూరావు అనుచరులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు పి.విఠల్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.నాగరాజు, ఎస్.నవీన్, తెదేపా నాయకులు వై.మోహనరావు, డి.శంకర్, జి.మల్లేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



వజ్రపుకొత్తూరు మండలం చినడోకులపాడు గ్రామాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పాతపట్నం, మరిడి, చండీ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా నిర్వహించారు. నూతన ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రాణ ప్రతిష్ఠ అనంతరం భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో శాంతి హోమం నిర్వహించారు. అన్న సమారాధన జరిగింది. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

అమలపాడులో ఘటాల ఉత్సవం



వజ్రపుకొత్తూరు మండలం అమలపాడులో మంగళవారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. స్థానిక దుర్గాదేవి లేబర్ కమిటీ ఆధ్వర్యంలో ఘటాల ఉత్సవం కనుల పండువగా సాగింది. పెద్దఎత్తున మహిళలు ఘటాలతో తరలివచ్చారు. దుర్గాదేవి విగ్రహాన్ని కేఆర్‌పేట బీచ్‌లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువత, మహిళలు నృత్యాలు చేశారు. సర్పంచి రత్నం బాలరాజు, తెదేపా నాయకుడు దున్న షణ్ముఖరావు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

కాలువలు శుభ్రం..

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం రెయ్యిపాడులో మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు'లో ఈ నెల 14న 'మురుగునీటి కాలువలు అధ్వానం' శీర్షికతో ప్రచురితమైన కథనంపై పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించారు. గ్రామంలోని కాలువల్లో మంగళవారం పూడిక తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఆయా పనులను సర్పంచి బచ్చల ధర్మారావు, పంచాయతీ కార్యదర్శి మోహిని పర్యవేక్షించారు.

స్పందనకు వందనం

పూడిక తీశారు

పలాస, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధి శివాజీనగర్ ప్రాంతంలోని మురుగునీటిని ఆర్టీసీ కాంప్లెక్స్ కాలువలోకి విడిచిపెడుతుండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు'లో ఈ నెల 14న 'దుర్వాసన భరించలేకున్నాం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. పురపాలిక అధికారులు స్పందించి పూడిక తీసేలా చర్యలు తీసుకున్నారు. హెల్త్ అసిస్టెంట్ శేఖర్, హేమంత్ ఆధ్వర్యంలో మంగళవారం పనులు చేపట్టారు. శివాజీనగర్ ప్రాంతంలోని మురుగునీరు ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోకి రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని డిపో ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు.

పనికి రాని మొక్కలు తొలగింపు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణం కార్జీ వీధిలోని ప్రజాబావిలో పనికిరాని మొక్కలు పెరగడంతో నీరు కలుషితమవుతోందని 'ఈనాడు'లో ఈ నెల 10న 'నిర్లక్ష్యం పెరుగుతోందిలా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై పుర కమిషనర్ నల్లి రమేష్, పారిశుద్ధ్య విభాగాధికారి పి.ఉపేంద్రకుమార్ స్పందించారు. మంగళవారం బావిపై పెరిగిన పనికి రాని మొక్కల్ని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. బ్లీచింగ్ కలిపి నీటిని శుద్ధి చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సోంపేట శ్మశాన వాటికలో దహన యంత్రం



సోంపేట ఆర్టీసీ కాంప్లెక్ వెనుక కాశీ విశ్వనాథస్వామి ఆలయం ఎదురుగా ఉన్న శ్మశానవాటికలో కర్రల అవసరం లేకుండా మృతదేహాలను దహనం చేసే యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని రోటరీ ఛైర్మన్ డాక్టర్ దుద్ది శ్రీనివాసరావు తెలిపారు. దీన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. – న్యూస్‌టుడే, సోంపేట

హరిపురం (మందస), న్యూస్‌టుడే

శిథిల సేతువు.. ప్రమాద హేతువు!

ఆందోళనలో గిరిపుత్రులు


ప్రమాదకర స్థితిలో వంతెన

మందస మండలం చీపి-బుడంబో కాలనీ మార్గంలో బొందుకారి వద్ద వంతెన శిథిలావస్థకు చేరింది. గోడలు విరిగిపోవడంతో సేతువు ప్రమాదకరంగా మారింది. ఏ క్షణాన కూలుతుందోని గిరిపుత్రులు ఆందోళన చెందుతున్నారు. వైకాపా హయాంలో మరమ్మతులు చేపట్టాలని పాలకులకు మొర పెట్టుకున్నా కన్నెత్తి చూడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వంతెన పరిస్థితి మరింత దయనీయంగా మారడంతో రాకపోకల సమయంలో బెంబేలెత్తుతున్నారు.

★ మందస నుంచి చీపి మీదుగా బుడార్సింగి, మందస నుంచి బడంబో మీదుగా సింగుపురం వెళ్లే రహదారులను అనుసంధానించి మూడు దశాబ్దాల కిందట ఈ రోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో బొందుకారి, సవరరాజపురం మధ్య గెడ్డపై వంతెన నిర్మించారు. ప్రస్తుతం వంతెన మూడు గోడల్లో శివారు రెండు కుంగాయి. కొన్ని భాగాలు విరిగి పాడయ్యాయి.

★ చీపిలో ఆశ్రమ ఉన్నత పాఠశాల, బుడంబోలో పీహెచ్‌సీ, ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ఉండటంతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. రహదారిపై రాళ్లు తేలి గోతులమయంగా మారింది. మరమ్మతులు, కొత్తగా వంతెన నిర్మాణానికి రూ.4 కోట్ల అంచనాతో అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. శిథిల వంతెన, రాళ్లు తేలిన రహదారిపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

15 గ్రామాలకు ఇబ్బంది



చీపి-బొందుకారి మధ్య గెడ్డపై వంతెన కూలితే 15 గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటారు. వైకాపా హయాంలో కొత్త వంతెన నిర్మించాలని అధికారులు, నేతలను పలుమార్లు అభ్యర్థించినా ఎవరూ పట్టించుకోలేదు.
-ఎస్.ధర్మారావు, ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు

నిధులు లేవన్నారు..



గత రెండేళ్లలో వరదలకు వంతెన బాగా దెబ్బతింది. మళ్లీ వరద వస్తే కూలిపోయేలా ఉంది. రెయిలింగ్‌ల వద్ద బెర్ముల్లో గోతులు ఏర్పడ్డాయి. రహదారిపై గొయ్యి ఏర్పడటంతో ముప్పు పొంచి ఉంది. కొత్త వంతెన నిర్మించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్తే నిధులు లేవన్నారు. కూటమి నేతలు చొరవ చూపి మరమ్మతులు చేయించాలి.
-ఎస్.భాస్కరరావు, ఆదివాసీ వికాస పరిషత్తు సంఘం మండల సభ్యుడు

ప్రతిపాదనలు పంపుతాం..

చీపి-బుడంబో రహదారి అభివృద్ధి, బొందుకారి వద్ద గెడ్డపై శిథిల వంతెనను తొలగించి కొత్త నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు చేయలేదు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం.
-ఎస్.శ్రీనివాసరావు, ఐటీడీఏ డీఈఈ, మందస

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్నలత

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్నలత సూచించారు. డిసెంబరు 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి కోర్టులో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అదాలత్‌లో ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు


శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

కంచిలి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేస్తే పర్యావరణానికి, నేలకు మేలు జరుగుతుందని.. ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ సంజీవరావు, మండల యాంకర్ టి.శివానందం తెలిపారు. కంచిలి మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం ఐసీడీఎస్ సోంపేట ప్రాజక్టు పరిధి అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. న్యూట్రి గార్డెన్, ఘన, ద్రవ జీవామృతాల ప్రయోజనాలు, తయారు చేసే విధానాలను వివరించారు. ఐసీడీఎస్ పీవో ఇందిర, సూపర్‌వైజర్లు, ఐసీఆర్పీలు పుష్పలత, రోహిణి, మీనా, భవానీ తదితరులు పాల్గొన్నారు.

? నందిగాం మండలం హర్షబాడ పంచాయతీ సవరరామకృష్ణాపురంలో గతంలో విద్యార్థులు లేరని ప్రాథమిక పాఠశాలను మూసేశారు. ప్రస్తుతం పిల్లల సంఖ్య పెరిగింది. బడిని మరలా తెరవాలి. **- బూరె మాధవరావు, గ్రామస్థుడు**

● క్షేత్రస్థాయిలో పరిశీలించి పిల్లలు ఎక్కువగా ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. పాఠశాల తెరిచేందుకు చర్యలు తీసుకుంటాం **- జి.నరసింహులు, ఎంఈవో, నందిగాం**

- న్యూస్‌టుడే, నందిగాం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం గంగువాడ జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పి.ఆర్.వల్లభరావు మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ఎం.జోషిత, జె.వీరేంద్ర, జె.వికాస్, బి.వేణుసాయి ప్రతిభ చూపినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా వ్యాయామోపాధ్యాయులు డి.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పీఎంశ్రీ పథకంతో ఉన్నత పాఠశాలల్లో సౌకర్యాలు



బుడితి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈవో తిరుమల చైతన్య

సారవకోట, న్యూస్‌టుడే: పీఎంశ్రీ పథకంతో ఉన్నత పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తామని డీఈవో తిరుమలచైతన్య చెప్పారు. మండలంలోని బుడితి ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుడితితో పాటు 32 పాఠశాలలకు పీఎంశ్రీ నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

నలుగురికి సంజాయిషీ: ఉదయం ప్రార్థనా సమయానికి ముందే డీఈవో బుడితి ఉన్నత పాఠశాలకు హాజరయ్యారు. నలుగురు ఉపాధ్యాయులు సమయపాలన పాటించనట్లు గుర్తించి సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం 3, 4, 5 తరగతులకు చెందిన విద్యార్థులతో ముచ్చటించి గణిత సామర్థ్యాలను పరీక్షించారు. సమాధానాలు సరిగా చెప్పిన వందనకు రూ.50 బహుమతిగా అందించారు.

సరిగా అమలుకాని మధ్యాహ్న భోజన పథకం: బుడితి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సరిగా అమలు కావడం లేదని ఎస్‌ఎంసీ ఛైర్మన్ భీమరాజు, డీఈవో ముందు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన డీఈవో ఎస్‌ఎంసీ సభ్యులందరూ సమావేశమై తీర్మానం చేసి వంట నిర్వాహకులను తొలగించుకోవచ్చని సూచించారు. ఎంఈవో-2 కె.భూలక్ష్మి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మాధవరావు పాల్గొన్నారు.

సందడిగా దసరా వారాలు



జలుమూరు: అబ్బాయిపేటలో అమ్మవారి గుడి వద్ద పత్రి కొమ్మలతో రైతుల పూజలు

సారవకోట, జలుమూరు, పోలాకి, న్యూస్‌టుడే: దసరా వారాలు మంగళవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. సారవకోట మండలంలోని గొర్లిబంద, కోనవానిపేట, సారవకోట గ్రామాల్లో ముగ్రాటలతో అమ్మవారికి చల్లదనం చేశారు. పోలాకి మండల పరిధిలోని మల్లపేటలో గ్రామదేవత అసిరితల్లి వారోత్సవాలను గ్రామస్థులు వైభవంగా జరిపారు. ఘటాలతో ఊరేగింపు చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. జలుమూరు మండలం జోనంకి పంచాయతీ అబ్బాయిపేటలో అమ్మవారి సన్నిధిలో రైతులు పత్రి కొమ్మలు ఉంచి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.



కడపలగెడ్డపై వంతెన నిర్మించక పోవడంతో వరదనీటిలో రాకపోకలు (పాతచిత్రం)

నేడు ఎల్‌ఎన్‌పేటలో మామిడి గోవిందరావు ప్రజాదర్బార్

ఎమ్మెల్యే సారూ.. ఇవీ మా సమస్యలు

ఎల్‌ఎన్‌పేట, న్యూస్‌టుడే

పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రతి బుధవారం నియోజకవర్గంలోని ఏదో ఒక మండలంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు ఎల్‌ఎన్‌పేట మండల పరిషత్తు భవనంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. గ్రామాలతో పాటు ప్రజల వ్యక్తిగత సమస్యలను పరిష్కరించేందుకు ఈ వేదిక ఏర్పాటు చేశారు. ఎల్‌ఎన్‌పేట మండలం ఏర్పడి రెండు దశాబ్దాలు గడిచినా ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. మండలంలో మొదటిసారిగా ఏర్పాటు చేసిన ఈ వేదిక అభివృద్ధికి దోహదపడుతుందని ప్రజల ఆశాభావంతో ఉన్నారు. ఎమ్మెల్యే స్పందించి దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌ఎన్‌పేట మండలంలో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

దశాబ్దాలుగా తీరని అవస్థలు

★ మండలం ఏర్పడి 24 ఏళ్లు అవుతున్నా ఇంతవరకు పోలీస్ స్టేషన్ ఏర్పాటు కాలేదు. ఇప్పటికీ సరుబుజ్జిలి నుంచే సేవలు కొనసాగుతున్నాయి.

★ విద్యుత్తు ఉపకేంద్రం రావిచెంద్రిలో ఏర్పాటు చేశారు. ఏఈ, సబ్ ఇంజినీర్ వంటి అధికారులను కేటాయించలేదు. ఈ సేవలు అన్నీ పొరుగు మండలం హిరమండలం నుంచే అందుతున్నాయి. ర.భ.శాఖ అధికారులు గతంలో సరుబుజ్జిలి నుంచి ఐదేళ్లుగా హిరమండలం కేంద్రంగా పనిచేస్తున్నారు.

★ 2005లో జంబాడ గ్రామం వద్ద కడగండి గెడ్డ జలాశయం నిర్మాణం చేపట్టారు. కానీ ఇంత వరకు కుడి, ఎడమ కాలువల పనులు ప్రారంభించలేదు. రిజర్వాయర్‌లో నీరు ఉన్నా రైతులకు ఉపయోగపడే పరిస్థితి లేదు.

★ డబ్బాపాడు- తురకపేట గ్రామాల మధ్య కడపలగెడ్డపై వంతెన 15 ఏళ్ల క్రితం శిథిలమైంది. జూన్ నెల నుంచి డిసెంబరు వరకు వరదనీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. దీంతో మండల కేంద్రానికి చేరుకునేందుకు పలు గ్రామాల ప్రజలు అదనంగా 15 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

★ మండలంలో 15 కిలోమీటర్ల పొడవునా వంశధార నది ఉంది. కానీ కరకట్ట నిర్మాణాలు చేపట్టలేదు. నదిలో వరదనీరు ప్రవహిస్తే పరివాహక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తుంటారు.



ఎల్‌ఎన్‌పేటకు సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ నుంచే సేవలు



ముందుకు సాగని కడగండి రిజర్వాయరు పనులు

★ మోదుగువలస కూడలి నుంచి గొట్టిపల్లి, ఏబీ రహదారి నుంచి ముంగెన్నపాడు, ఎల్‌ఎన్‌పేట కూడలి నుంచి బొత్తాడసింగి, ఎల్‌ఎన్‌పేట నుంచి పెద్దకోట గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారాయి.

★ సాంఘిక సంక్షేమ వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. పలు గ్రామాల్లో అంగన్‌వాడీ, పాఠశాలలు భవనాలు లేవు.

★ మెగా రక్షిత మంచినీటి పథకం నుంచి 30 గ్రామాలకు తాగునీరు సరఫరా కావాల్సి ఉంది. తరచూ మరమ్మతులతో పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు.

★ వంశధార రిజర్వాయరు నిర్మాణంలో భాగంగా మోదుగువలస, తాయిమాంబపురం, పెద్ద కొల్లివలస, శ్యామలాపురం గ్రామాల్లో పునరావాస కాలనీలు ఏర్పాటు చేశారు. ఆ కాలనీల్లో సమస్యలతో నిర్వాసితులు ఇక్కట్లు పడుతున్నారు.

రాయితీపై సౌర పలకలు అందిస్తాం



వినియోగదారుల సందేహాలు నివృత్తి చేస్తున్న ఏడీ ప్రసాద్

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: గృహ, వ్యాపార అవసరాలకు రాయితీపై సౌర పలకలు అందిస్తామని పాతపట్నం విద్యుత్తు సంస్థ ఏడీ జీవీ ప్రసాద్ అన్నారు. మెళియాపుట్టి విద్యుత్తు ఉపకేంద్రంలో వినియోగదారులకు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేస్తున్న పథకం గురించి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఈ రవిసాగర్, గుత్తేదారు సోమేశ్వరరావు, సిబ్బంది రాంబాబు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం

హిరమండలం, న్యూస్‌టుడే: వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని ఏపీఎం పి.కూర్మారావు అన్నారు. మంగళవారం హిరమండలంలో మహిళా సంఘాల సభ్యులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు జయంతి, శ్రీదేవి, అప్పన్న పాల్గొన్నారు.

అఖండ నామ సంకీర్తన

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం శిర్డీ సాయిబాబా ఆలయంలో వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా ఘనంగా అఖండ నామ సంకీర్తన జరుగుతుంది. ఈ నెల 3వ తేదీ నుంచి అక్టోబరు 21 వరకు 49 రోజుల పాటు అంతరాయం లేకుండా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పాతపట్నంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

మురుగు పోయే మార్గమేదీ



నరసన్నపేట మండలం జాతీయ రహదారి నుంచి గోపాలపెంట వెళ్లే మార్గంలో గ్రామం వద్ద మురుగునీరు నిలిచిపోవడంతో స్థానికులు, వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు చేసేందుకు తవ్వకాలు చేపట్టి రోడ్డును పునరుద్ధరించక పోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి మహ్మద్ జావెద్ వద్ద ప్రస్తావించగా, నీరు తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, నరసన్నపేట**

గ్రహణం వీడేదెప్పుడు..?

పోలాకి మండల పరిధిలోని ఉరజాం గ్రామంలో రెండేళ్ల కిందట నిర్మాణం ప్రారంభించిన విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీనికి అప్పట్లో వైకాపా ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించింది. పనులు జరిగిన మేరకు గుత్తేదారుకు బిల్లులు అందక పోవడంతో మధ్యలో ఆపేశారు. దీంతో సిబ్బంది అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై మండల ఇంజినీరింగ్ అధికారి మోహనరావు మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. పనులు త్వరలో పూర్తయ్యేలా చూస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, పోలాకి**



నిర్మించి రెండేళ్లు.. అప్పుడే పగుళ్లు



హిరమండలం పరిధి మర్రిగూడ పంచాయతీ గ్రామ సచివాలయం భవనం అధ్వానంగా మారింది. రెండేళ్ల క్రితం వైకాపా హయాంలో రూ.18 లక్షలతో దీనిని నిర్మించారు. నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో గోడలు, గదుల్లో పగుళ్లు వచ్చాయి. పలకలు ఊడిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల పాటు మన్నికగా ఉండాల్సిన భవనం పరిస్థితి ఇలా ఉండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు తెలిపారు. **- న్యూస్‌టుడే, హిరమండలం**

నిర్వహణ కరవు.. దీపాలు ఆరవు



నందిగాం మండలం నరేంద్రపురం పంచాయతీ పాతినవానిపేట గ్రామంలో వీధి దీపాలు రాత్రి, పగలు తేడా లేకుండా నిత్యం వెలుగుతున్నాయి. దీంతో అవి త్వరగా మరమ్మతులకు గురవడమే కాకుండా పంచాయతీకి అధికంగా విద్యుత్తు బిల్లులు వచ్చే అవకాశముందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, రాత్రి మాత్రమే వెలిగేలా చూడాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశిస్తామని ఎంపీడీవో రాజారావు పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, నందిగాం**

వేరే దారి లేదు.. తప్పదు మరి



టెక్కలి పట్టణంలోని సోగ్గాడిపేట వీధిలో రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగు ప్రవహించే మార్గం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. వేరే దారి లేక దాని మీద నుంచే రాకపోకలు చేస్తున్నామని వాహనదారులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం**

సందడిగా పల్లె పండగ



కోటబొమ్మాళి: తిలారు పంచాయతీ గవరంపేటలో..

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా మంగళవారం 'పల్లె పండగ' కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు భూమిపూజలు చేశారు. గ్రామాలను ప్రగతి బాటలో నడిపించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని వక్తలు పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే బృందం**



సారవకోట: బైదలాపురంలో తెదేపా మండల అధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో..



అంబావల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు, తెదేపా నాయకులు



జలుమూరు: వెంకటాపురంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఇతర నాయకులు



మెళియాపుట్టి: 'పల్లె పండగ' కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



టెక్కలి గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న పాఠకులు



కొత్తూరు మండలం కురిగాంలో..

కలాం సేవలు చిరస్మరణీయం

టెక్కలి పట్టణం, హిరమండలం, నరసన్నపేట, కొత్తూరు, సారవకోట, న్యూస్‌టుడే: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం పలుచోట్ల ఆయన జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా స్ఫూర్తిదాయకంగా పనిచేశారని కొనియాడారు.



హిరమండలం: అంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



సారవకోట: అవలంగిలో అక్షర రూపంలో విద్యార్థుల ప్రదర్శన

అవీ.. ఇవీ.. అన్నీ

ప్రభుత్వ స్థలాన్ని దళితులకు కేటాయించాలి

సారవకోట, న్యూస్‌టుడే: కిడిమి పంచాయతీ భద్రాచలం గ్రామానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్థానిక దళిత కుటుంబాలకు కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం తహసీల్దారు విజయలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. డీటీ రవి, సంఘ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు మండలం అచ్యుతాపురం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీముఖలింగం గ్రామానికి చెందిన కుంచాల వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, 108 సిబ్బంది తెలియజేసిన వివరాల మేరకు.. వెంకటరమణ కొమనాపల్లి నుంచి స్వగ్రామం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి ట్రాక్టర్ ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. 108లో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో తరలించినట్లు సిబ్బంది మురళీ, పాపారావు పేర్కొన్నారు.



ఉద్యోగ భద్రత కల్పించండి

హిరమండలం, న్యూస్‌టుడే: ఉద్యోగ భద్రత కల్పించాలని ఒప్పంద అధ్యాపకులు కోరారు. మంగళవారం హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పల్ పీఈఎస్ పట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. పసుపు బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సరకు స్వాధీనం

నరసన్నపేట: ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణకు కూటమి ప్రభుత్వం చరమగీతం పాడిన విషయం తెలిసిందే. ఈ మేరకు మద్యం దుకాణాల్లోని సామాగ్రిని ఎక్సైజ్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 16 నుంచి ప్రైవేటు దుకాణాల తెరుస్తారు. నరసన్నపేట సర్కిల్ పరిధిలో 12 దుకాణాలు నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ రమణమూర్తి తెలిపారు.



అవలంగిలో ఆక్రమణల తొలగింపు

సారవకోట: మండలంలోని అవలంగిలో కొందరు వ్యాపారులతో పాటు స్థానికులు రోడ్డును ఆనుకుని ఉన్న కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ప్రధాన మార్గం ఇరుకుగా మారింది. వాహన రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. విషయాన్ని గుర్తించిన సర్పంచి పావని పొక్లెయిన్‌తో మంగళవారం ఆక్రమణలు తొలగించారు.

అభ్యసన వైకల్యంపై చైతన్యం కల్పిద్దాం



నరసన్నపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

నరసన్నపేట, నందిగాం, కొత్తూరు, న్యూస్‌టుడే: అభ్యసన వైకల్యంపై (డిస్‌లెక్సియా) తల్లిదండ్రులు, విద్యార్థుల్లో అవగాహన అవసరమని ఎంఈవో యు.శాంతారావు అన్నారు. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి అవగాహన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువులో ఇబ్బందులు ఎదుర్కొనే విద్యార్థులకు అండగా ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు పాల్గొన్నారు. ★ నందిగాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు డిస్‌లెక్సియాపై గ్రామ పుర వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సమస్య ప్రపంచ జనాభాలో 10 శాతం మందికి ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు యర్నాగుల హరిబాబు పేర్కొన్నారు. ★ చిన్నారుల సమస్యలను తల్లిదండ్రులు మూడేళ్ల లోపు గుర్తిస్తే మంచిదని కొత్తూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎ.గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐఈఆర్టీలు శారద, యుగంధర్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు



కోటబొమ్మాళి: నారాయణవలసలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

మెళియాపుట్టి, కోటబొమ్మాళి, నందిగాం, న్యూస్‌టుడే: వరి సాగులో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.వి.మధుబాబు అన్నారు. మంగళవారం మెళియాపుట్టి మండలం భరణికోట సచివాలయం పరిధిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన రైతులకు సేంద్రియ సాగు విధానాలపై చైతన్యం కల్పించారు. వ్యవసాయాధికారి దానకర్ణుడు పాల్గొన్నారు. ★ తగిన మోతాదులో ఎరువులు వినియోగించాలని వ్యవసాయాధికారి పెయ్యల శ్రీకాంత్‌వర్మ అన్నారు. నందిగాం మండలం కవిటిఅగ్రహారం, పెద్దబాణాపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. కోటబొమ్మాళిలో వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.

సర్వశిక్షా అభియాన్ డైరెక్టర్‌కు నోటీసులు

సారవకోట, న్యూస్‌టుడే: సర్వశిక్షా అభియాన్ ద్వారా విడుదలైన ఉద్యోగాల భర్తీ ప్రకటనలో ఎస్సీ, ఎస్టీలకు రోస్టర్ విధానం అమలు చేయలేదని దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని గత నెల 28న జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఆదివాసీ సంక్షేమ పరిషత్తు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంగళవారం సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు పునరాలోచన చేయాలన్నారు.

శ్రీకాకుళం
•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

తెరపై ఈనాడు

★ కీర్తన: రామ్‌నగర్ బన్నీ ★ కీర్తిక: సత్యం సుందరం ★ కిన్నెర సినీమాక్స్: దేవర ★ ఎస్‌వీసీ (రామలక్ష్మణ): వేట్టయన్ ★ సూర్యమహల్: విశ్వం ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: జనక అయితే గనక ★ మారుతి: మా నాన్న సూపర్ హీరో – న్యూస్‌టుడే, అరసవల్లి

నేడు వర్సిటీలో రిపబ్లిక్ పరేడ్ వాలంటీర్ల ఎంపిక

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బి.ఆర్.అంబేడ్కర్‌విశ్వవిద్యాలయం తరఫున రిపబ్లిక్ డే పరేడ్ కార్యక్రమంలో పాల్గొనే వాలంటీర్ల ఎంపిక వర్సిటీలో బుధవారం నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. మురపాన అనురాధ మంగళవారం తెలిపారు. వర్సిటీ, అనుబంధ కళాశాలల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు హాజరుకావాలన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఘనంగా గౌరీపౌర్ణమి వేడుకలు ప్రారంభం



ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట గ్రామంలో గౌరపౌర్ణమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం గౌరీ దేవిని గ్రామల్లో ఊరేగించారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా జే.ఆర్.పురం సీఐ అవతారం, ఎస్సై వి. సందీప్ కుమార్‌లు బందో బస్తు ఏర్పాటుచేశారు.

ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా..?



ఆమదాలవలస నుంచి హిరమండలం వెళ్లే గ్రామాలకు పూర్తి స్థాయిలో బస్సులు లేకపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. బస్సులో ఖాళీ లేకపోవడంతో పుట్‌బోర్డుపై ఒక కాలు పెట్టి మరో కాలు గాలిలో ఉంచుతూ ప్రయాణిస్తున్నారు.. ఏ మాత్రం పట్టుతప్పినా.. ఊహకందని ప్రమాదం జరుగుతుంది. అధికారులు తక్షణమే స్పందించి అదనపు బస్సులు వేయాలని విద్యార్థులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

పంచాయతీలపై సచివాలయాల భారం..!

అంపోలు-3 గ్రామ సచివాలయం



న్యూస్‌టుడే, గార, గుజరాతీపేట

వైకాపా హయాంలో లబ్దిదారులకు ప్రభుత్వ పథకాలను చేరువ చేయాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. అందులో భాగంగా గ్రామాల్లో ప్రాధాన్యత భవనాలను నిర్మించింది. రూ.లక్షలు వెచ్చించి అందుబాటులోకి తీసుకువచ్చిన గ్రామ సచివాలయ నిర్వహణ మాత్రం పంచాయతీలే భరించాలని సూచించింది. దీంతో అసలే నిధుల్లేక సతమతమవుతున్న పంచాయతీలపై అదనపు భారం పడింది. కూటమి ప్రభుత్వం వీటి నిర్వహణకు నిధులు కేటాయింపుపై దృష్టి సారించాలని సర్పంచులు కోరుతున్నారు.

● గార మండలంలో 25 పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో 26 సచివాలయాలు ఏర్పాటు చేశారు. కొన్ని పంచాయతీల్లో 3 నుంచి 4 వరకు సచివాలయాలు కొనసాగుతున్నాయి. అలాంటి చోట్ల రూ.లక్షల్లో ఖర్చు అవుతుండటంతో సర్పంచులు, అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాలు ఏర్పాటు చేసిన కొత్తలో కంప్యూటర్లు, బల్లలు, కుర్చీలు, కాగితాలు, ప్రింటర్లు, ఇతర సామగ్రి ప్రభుత్వమే సమకూర్చింది. అనంతరం వాటి నిర్వహణను పూర్తిగా విస్మరించి.. ఆ బాధ్యత పంచాయతీలపై నెట్టేసింది. మండలంలో వార్షిక ఆదాయం రూ.3 లక్షల్లోపు ఉన్న పంచాయతీలు చాలా ఉన్నాయి. వాటికి వచ్చే అరకొర ఆదాయంతోనే అన్ని ఖర్చులు చూసుకోలేకపోతున్నారు. ప్రతి సచివాలయానికి సగటున ఏటా రూ.35 నుంచి 50 వేల వరకు వ్యయం అవుతుందని సర్పంచులు చెబుతున్నారు. విద్యుత్తు, అంతర్జాలం బిల్లులు, కాగితాలు, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు, ప్రింటర్లు, కంప్యూటర్ల మరమ్మతులు, ఇతర ఖర్చులకు పంచాయతీ నిధులే వెచ్చిస్తుండటంతో కష్టంగా ఉంటోందని చెబుతున్నారు.

నిబంధనలకు విరుద్ధమైనా..

పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించింది. మిగిలిన కొద్దిపాటి సొమ్ము పంచాయతీ అవసరాలకే సరిపోవడం లేదు. చాలా చోట్ల కనీసం విద్యుత్తు బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. సచివాలయాల నిర్వహణ ఖర్చులు సాధారణ నిధుల నుంచే ఖర్చు చేయాలని ఆదేశాలు లేనప్పటికీ తప్పనిసరి పరిస్థితిలో చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ ఖర్చు చేశారని ఆడిట్ సమయంలో అభ్యంతరాలు ఎదురవుతున్నా ఉన్నతాధికారుల ఒత్తిడితో తప్పట్లేదని అధికారులు చెబుతున్నారు.

ఇబ్బందుల్లేకుండా చూస్తాం..

ప్రస్తుతం మండలంలోని గ్రామ సచివాలయాల నిర్వహణ పంచాయతీ నిధులు నుంచే ఖర్చు చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్తాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.
– ఎస్.రామ్మోహన రావు, ఎంపీడీవో, గార

విశ్వవిద్యాలయ పోటీల్లో రాణించండి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: ఆలిండియా విశ్వవిద్యాలయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లోనూ రాణించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీఎస్‌డీవో) డా.కళ్లేపల్లి శ్రీధర్‌రావు అన్నారు. ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు గుజ్జల వర్షిత, ముద్దాడ తరుణ్‌లను ఆయన మంగళవారం నగరంలోని డీఎస్ఏ ఈతకొలను వద్ద అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులతో పాటు, డీఎస్ఏ శిక్షకుడు ఇప్పిలి అప్పన్న, గుజ్జల హిమగిరి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీవో శ్రీధర్‌రావు

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత



ఇసుక కడ్డీ అడ్డంగా పెట్టి ట్రాక్టర్లను అడ్డుకుంటున్న అన్నదాతలు

ఆమదాలవలస గ్రామీణం,కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే : ఆమదాలవలస మండలంలోని దూసికి చెందిన పలువురు రైతులు మంగళవారం నాగావళి నుంచి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అడ్డగించారు. ఇసుకు తరలిస్తున్నది అదే గ్రామానికి చెందిన వారు కావడం గమనార్హం. ఓ చోట ఇసుకు పోగు చేసి రాత్రి వేళ లారీల్లో దూర ప్రాంతాలకు తీసుకెళ్లి సొమ్ముచేసుకుంటున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ● అంతకు ముందే తరలించి రాగోలులో ఉంచిన నిల్వలను తహసీల్దార్ గణపతిరావు, ఎస్సై కిశోర్ వర్మ పరిశీలించి సీజ్ చేశారు.

బీఈఎఫ్ఐ వ్యవస్థాపక దినోత్సవం.. పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ఎన్జీవో హోం సమావేశ మందిరంలో మంగళవారం బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(బీఈఎఫ్ఐ) వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు చేయాలని సూచించారు.

గొయ్యి ఉంది జాగ్రత్త



మండలంలోని తురకపేట గ్రామానికి సమీపంలోని కల్వర్టు వద్ద ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. మూలసవలాపురం నుంచి పాతపాడు-అగ్రహారం వెళ్లే ఈ రహదారిలో అధికంగా ప్రయాణిస్తుంటారు. రాత్రి వేళల్లో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ జేఈ అంజనేయనాయక్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

చెత్త సంపద కేంద్రాలు మూలకు



గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు గతంలో చెత్తనుంచి సంపద కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి మూలకు చేరాయి. జగన్నాథ వలసలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని అధికారులు పరిశీలిస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు తెలిపారు. దీంతో గ్రామంలో చెత్త, ఇతర వ్యర్థాల కుప్పలు కనిపిస్తున్నాయి. కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉంటే చెత్త సమస్య ఉండదని అభిప్రాయ పడుతున్నారు. ఈ విషయం ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామకృష్ణతో ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

ప్రారంభమెప్పుడు?



పొందూరు మండలం తాడివలస గ్రామంలో తాగునీటి సమస్య తీర్చేందుకు నిర్మాణం చేపట్టిన తాగునీటి పథకం ఇంతవరకు ప్రారంభించలేదు. నెలలు గడుస్తున్నా చర్యలు లేకపోవడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయం ఎంపీడీవో మన్మధరావు వద్ద ప్రస్తావించగా సంబంధిత అధికారులతో మాట్లాడి పథకం ప్రారంభిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, పొందూరు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఆటో చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేష్

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఆటో చోదకులు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్, రహదారి భద్రత ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఇష్టానుసారంగా రహదారులపై ఆటోలు నిలపడం, ట్రాఫిక్ అంతరాయం కలిగించడం, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం, అతి వేగం ఇతర అంశాలపై హెచ్చరించారు.



గార: ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు



సరుబుజ్జిలి: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

డిస్లెక్సియాను అధిగమించవచ్చు

విద్యార్థుల్లో అభ్యాస వైకల్యం(డిస్లెక్సియా) పాఠశాల స్థాయిలోనే గుర్తించాలని అధికారులు, ప్రధానోపాధ్యాయులు అన్నారు. మంగళవారం పలుచోట్ల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ రుగ్మత చదవడం, రాయడం వంటి నైపుణ్యాలపై ప్రభావితం చేస్తుందన్నారు. ముందుగా గుర్తిస్తే నివారణకు అవకాశం ఉందన్నారు.
– న్యూస్‌టుడే, బృందం

స్ఫూర్తిప్రదాత అబ్దుల్‌కలాం

దివంగత రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తి ప్రదాత అని వక్తలు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సమాజానికి చేసిన సేవను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశ ప్రయోజనలే లక్ష్యంగా పని చేసిన మహానుభావుడని కొనియాడారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్, నేరవార్తావిభాగం, సాంస్కృతికం, గార పొందూరు, బూర్జ, ఎచ్చెర్ల,



శ్రీకాకుళం అర్బన్: గాంధీ మందిరంలో కలాం విగ్రహానికి కమిటీ ప్రతినిధుల నివాళి



పొందూరు: అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శ్రీ శివాని ప్రిన్సిపల్‌కు ఈఎల్‌పీడీ అవార్డు



ఎచ్చెర్ల మండలం శ్రీ శివాని ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యులు వై.శ్రీనివాసరావుకు 'ఎక్సలెన్స్ ఇన్ లీడర్‌షిప్ అండ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ అవార్డు' దక్కింది. కౌన్సిల్ ఫర్ స్కిల్ అండ్ కాంపిటెన్స్ సంస్థ ఈ పురస్కారం అందజేసింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యనందించడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఈ ఘనత దక్కినట్లు శ్రీనివాసరావు తెలిపారు. –న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

యాంత్రీకరణతో వరి సాగు మేలు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: యాంత్రీకరణతో వరి సాగు రైతుకు మేలు చేస్తుందని మండల వ్యవసాయ అధికారి ఎం. మోహనరావు అన్నారు. శ్రీనివాసాచార్యులు పేటలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

ప్రపంచ కళా జాతరకు గజల్ రాములు ఎంపిక

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: శ్రీశ్రీ కళావేదిక ప్రపంచ కళా జాతరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆమదాలవలస ప్రధానోపాధ్యాయుడు, గజల్ కళాకారుడు కె.ఎ. రాములు ఎంపికయ్యారు. ఈ నెల 19, 20వ తేదీల్లో తాడేపల్లిగూడెంలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

మార్క్‌ఫెడ్ డైరెక్టరుకు సన్మానం

బూర్జ, న్యూస్‌టుడే: బూర్జ మండలం జడ్పీటీసీ మాజీ సభ్యులు పెద్దపేటకు చెందిన ఆనెపు రామకృష్ణకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ డైరెక్టరుగా నియమించిన విషయం విదితమే. ఈ సందర్భంగా మంగళవారం తహసీల్దారు పద్మావతి, సిబ్బంది పెద్దపేటలోని ఆయన స్వగృహంలో సన్మానించారు.

పీజీ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 17 నుంచి 22 వరకు తక్షణ ప్రవేశాలు జరుగుతాయని ప్రిన్సిపల్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. ఎంఏ తెలుగు 29, ఎంఎస్సీ జంతుశాస్త్రం 19, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ 11, ఎంఎస్సీ కంప్యూటర్స్‌లో 2 సీట్లు ఖాళీ ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు 94925 43638, 70756 06760, నంబర్లను సంప్రదించవచ్చునని సూచించారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలి

పొందూరు, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పొందూరు పట్టణంలో మంగళవారం సాయంత్రం ఓ కల్యాణ మండపంలో సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాలు, ఇతర సమస్యలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. గ్రామ కంఠాలు, సరిహద్దులు, ఇతర ప్రశ్నలకు సచివాలయ సిబ్బంది, కార్యదర్శుల నుంచి సమాధానం రాకపోవడంతో మందలించారు. నేర్చుకోవాలనే తపన ఉండాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు అన్నెపు రాము, బాడాన గిరి, అనకాపల్లి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. బియ్యం!



సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: అదో శిఖరాగ్ర గ్రామం అక్కడ ఉన్న గిరిజనులవి రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు. ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తున్న రేషన్ బియ్యం వీరి కొన్నిసార్లు ఇవ్వకపోవడం. పలుమార్లు ఆలస్యంగా ఇవ్వడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల బియ్యం 15వ తేదీ వచ్చినా. . ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. చిగురువలస పంచాయతీలో బక్రిపేట గ్రామంలో 13 మంది గిరిజన కార్డుదారులకు బియ్యం ఇవ్వకపోవడంతో మంగళవారం నిరసన తెలిపారు. డీలరు చుట్టూ తిరుగుతున్నా అదిగో ఇదిగో అంటున్నారే తప్పా సరకులు ఇవ్వడం లేదని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారుడు సవర సులోమ విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై తహసీల్దారు మధుసూదన వద్ద ప్రస్తావించగా బక్రిపేట గ్రామంలో రేషన్ సరుకులు అందలేదన్న విషయంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి



తండేంవలసలో రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్



పొందూరులో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

కలెక్టరేట్(శ్రీకాకుళం), గార, పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం గ్రామీణ మండలంలోని తండేంవలస, శిలగాం సింగివలస, అలికాం, భైరివానిపేట, గార మండలం కళింగపట్నం, కె. మత్స్యలేశం, బందరువానిపేట, తోణంగి, వమరవల్లి గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ● ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పొందూరులో, తండ్యాంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

కూటమి నాయకులకే పనులు



మాట్లాడుతున్న మాజీ సభాపతి తమ్మినేని సీతారాం

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు భోజనం, తాగు నీరు, పండ్లు, నిత్యావసర సరకులు అందించామని రూ. కోట్లు ఖర్చు చూపి తెదేపా నేతలు స్వాహా చేశారని మాజీ సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. ప్రజా ధనాన్ని దోచుకోవడంలో చంద్రబాబు ముందు వరుసలో ఉంటారని దుయ్యబట్టారు. 'సూపర్ 6' పేరిట ప్రజలను మోసగించారన్నారు. కూటమి ప్రభుత్వం విఫలమైందని, పల్లెపండగ కార్యక్రమంలో ప్రారంభించిన పనులు కూటమి నాయకులకే అప్పగిస్తున్నారన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా



మాట్లాడుతున్న సువ్వారి గాంధీ

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: నాగావళి పరివాహక ప్రాంతాలైన 13 చోట్ల నుంచి రాత్రి వేళల్లో లారీల్లో ఇసుక తరలి వెళ్తున్న జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమదాలవలస ప్రస్తుతం అభివృద్ధిలో వెనకబడి అవినీతి, అక్రమాల్లో దూసుకెళ్తోందని ఎద్దేవా చేశారు. అక్రమాల్లో ఎమ్మెల్యే కూన రవి కుమార్ హస్తం ఉందని, 120 రోజుల్లో రూ.కోట్లు కూడబెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో పేడాడ వైకుంఠరావు, సువ్వారి అనీల్, అన్నెపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన విజయనగరం జిల్లా, రేగిడి ఆమదాలవలస మండలం కొమిరి వెంకటాపురం గ్రా॥ వాస్తవ్యులు కింజరాపు లేటు సత్యన్నారాయణ నాయుడు గారి కుమారుడు కింజరాపు మధుసూధనరావు ఇచ్చిన భోగట్టాపైన ఇచ్చిన బహిరంగ ప్రకటన.

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని శ్రీకాకుళం టౌను చల్లా వీధి కాపురస్తులు ముఖలింగము దాసు గారి కుమార్తె కాంచన వాణి వురఫ్ గాంచన వాణి నా క్లయింటుకు క్రయానికి విక్రయించుటకు గాను అంగీకరించి శె॥ 1కి 1,75,000/- చొ॥న అంగీకరించి నా క్లయింటు వద్దను తే 19-8-2002దిని రూ. 14,00,000/- నగదు అడ్వాన్సుగా పుచ్చుకొని శేషించిన క్రయ ధనము నా క్లయింటు వద్ద నుండి రెండు సంవత్సరములు లోగా పుచ్చుకొని నా క్లయింటు పేరున క్రయ దస్తావేజు చేయుటకు అంగీకరించి తే 19-8-2002దీని నా క్లయింటు పేరున సదరు కాంచన వాణి ఎలియస్ గాంచన వాణి క్రయ అగ్రిమెంటు వ్రాసి యిచ్చినారనియూ దర్మిలా సదరు కాంచన వాణి షరతుల ప్రకారము నియమిత కాలము పరిధి క్రయ దస్తావేజు వ్రాయించి యివ్వనందున నా క్లయింటు సదరు కాంచన వాణిపైన శ్రీకాకుళం 2వ అదనపు జిల్లా జడ్జి (Fast Track Court)లో O.S. 13/2004 specific performance of agreement of Sale చేయు నిమిత్తము దావా దాఖలు చేయగా సదరు దావా తే 3-5-2009దిన నా క్లయింటు పేరున డిక్రీ జారీచేస్తూ అగ్రిమెంటు షరతుల ప్రకారము శేషించిన క్రయ ధనం రూ. 1,75,000/- నా క్లయింటు కోర్టులో చలానా మూలముగా చెల్లించి సదరు కాంచన వాణి క్రయ దస్తావేజు వ్రాయించి యివ్వనందున కోర్టు వారిని ప్రతివాది స్థానే క్రయ దస్తావేజు వ్రాయించి యివ్వమని కోరుచూ EP 9/2010, O.S. 13/2004 అమలు దాఖలు చేయగా అందుకైన నోటీసును సదరు కాంచన వాణికి పంపినప్పటికీ కాంచన వాణి క్రయ దస్తావేజును చేయించి యిచ్చుటకు రానందున కాంచన వాణి స్థానే తే 20-12-2014దిన ముఖలింగము దాసు గారి కుమార్తె కాంచన వాణి తరఫున మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారు అయిన V. అప్పారావు B.Sc., B.L. షెడ్యూలు ఆస్తికి క్రయ దస్తావేజు నా క్లయింటు తరఫున వ్రాసి యిచ్చియున్నారు.

కావున సదరు షెడ్యూలు ఆస్తికి నా క్లయింటు మాత్రమే సంపూర్ణ హక్కు అనుభవములు కల్గి యున్నారు. సదరు షెడ్యూలు ఆస్తిపై ఎవ్వరికి ఎటువంటి హక్కులు లేవు కాగా సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిని వేరే వారు వారికి ఎటువంటి హక్కులు లేనప్పటికి క్రయ విక్రయములు చేయుటకు ప్రయత్నించుచున్నట్లు నా క్లయింటుకు తెలియవచ్చినది. కావున షెడ్యూలు ఆస్తికి నా క్లయింటు మాత్రమే సంపూర్ణ హక్కులు కల్గి యున్నారు. నా క్లయింటుకు తెలియకుండా సదరు షెడ్యూలు ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు జరిపినను అవి నా క్లయింటుకు బంధించవు. అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం మండలం, శ్రీకాకుళం మున్సిపాలిటీ, శ్రీకాకుళం టౌన్ బలగ వార్డు, కాన్వెంట్ రోడ్డు (న్యూ బ్రిడ్జి రోడ్)కు ఉత్తర శ్రేణిలో యున్నటువంటి T.S No. 713/3 రెవిన్యూ సర్వే నెంబరు 197లో చేరిన పూరా య 0-17 శె॥లో పశ్చిమ వైపు య 0-09 శె॥ గల ఖాళీ స్థలంకు హద్దులు.

తూ: మార్పు ఆనందరావు గారి ఖాళీ స్థలం, దక్షిణం: కాన్వెంట్ రోడ్డు, పడమర: ఆంధ్ర ఇవాంజలి లూథరిన్ చైల్డ్ చర్చి తాలూకా స్థలము, ఉ: పుప్పాల సూర్యారావు నాయుడు గారి ఖాళీ స్థలము.

PADI SEETHANNAIDU, Advocate
Illisipuram, Srikakulam. Cell: 9440115791